## తీగెలు లేని టెలిఫోన్ ద్వారా ప్రేమ తీగెలల్లుకున్న సరికొత్త ప్రేమకథ!

నిన్న నా టెలిఫోన్ చనిపోయింది.

మనుష్యులే కాదు టెలిఫోన్‌లు కూడా చనిపోతాయా ! అని మీరాశ్చర్యపడవచ్చు. నిజానికి చనిపోయింది టెలిఫోన్ కాదు. టెలిఫోన్ నంబర్ మాత్రమే.

జీవితంలో ఎన్నో అంకెలు మరచిపోవచ్చు. మీ పాస్‌పోర్ట్ నంబర్, మీ స్నేహితుని కారు లేక స్కూటర్ నంబర్, మీ పట్టణ జనసంఖ్య, చంద్రమండలానికి,భూమికి వున్న దూరం ఇలాగే మరెన్నో.కాని ఆ అయిదంకెల సంఖ్యను, దానితో అనుక్రమంగా జరిగిన ఆ సంఘటనలు, మృదువైన ఆమె కంఠధ్వని, రిసీవర్‌లోంచి వచ్చే ఆ రోజాల పరిమళం (ఆ చక్కర్‌లో పడినపుడు అలానే అనిపిస్తుంది కాబోలు) నా స్మృతి నుంచి వదలిపోవడం లేదు. అవి వదలిపోవు కూడా.

పెద్దకథ

'లవ్ స్టోరీ'

# వినిపించని రాగం

బి.యస్.రావ్

అప్పుడప్పుడు ఆమెకు ఫోన్ చేయాలని రిసీవర్ ఎత్తుతుంటాను. కాని ఫోన్ చేయలేను. ఆ స్థలం నాకు ప్రవేశయోగ్యం కానిది. ఆమెకు, నాకు మధ్య ఎంతో దూరం. నేను చేరువ కాలేనంత దూరం. ఆ అయిదంకెలలో నాలుగు అంకెలు డయల్ చేయగలనుకాని ఆ ఆఖరు సంఖ్య డయల్ చేయలేను.

నేను ఆమెను చూడనవసరంలేదు. ఫోన్‌చేసి ఆమె మాటలు వినగలను. "యు లుక్ చీర్‌ఫుల్ టుడే. వాట్స్ ద రీజన్ ?" అని, అనగలిగే స్వేచ్ఛ నాకుంది కాని.. కాని ఆమెకు ఫోన్‌చేయలేను. ఎందుకంటే....?

* * *

గోపాల్‌కి కొత్తగా పెళ్ళయింది. భార్యను కాపురానికి తీసుకొచ్చాడు. ఆ సందర్భంగా గ్రీన్‌పార్క్‌లోఉన్న అతనింటికి మమ్మల్ని పార్టీకై పిలిచాడు. గోపాల్‌తో కలిసి మేం అయిదుగురం. గోపాల్, సుధాకర్, మురళి, విజయ్. ఈ కథకు హీరో అయిన నేను అనిల్‌ని. మాలో కాస్త పెద్దవాడు విజయ్. పెళ్ళి కావలసినవాణ్ణి నేనొక్కణ్ణి. మా మధ్య యెంతో క్లోజ్ ఫ్రెండ్‌షిప్ వుంది.

అనుకున్న టైమ్‌కి అందరం గోపాల్ యింటికి చేరాం సతీసమేతంగా,అఫ్‌కోర్స్ నేనొక్కణ్ణి తప్ప. ఒకరి నొకరు విష్ చేసుకొన్న తర్వాత మెల్లిగా కబుర్లలో పడ్డాం. కబుర్ల దగ్గర కొచ్చేసరికి ఆడవాళ్ళదంతా ఒక "బేచ్" అయింది. వాళ్ళ కబుర్లు ఎంతకీ తరగటం లేదు. బహుశా ఇటువంటి అవకాశాలు వాళ్ళకి అరుదుగా వస్తుంటాయి కాబోలు, గోపాల్ పిలువగా మేమంతా ప్రక్కగదిలోకి వెళ్ళాం.

అద్భుతం, దానికి సరిపోయే సరంజామా అంతా రెడీగా అమర్చి వుంది. "అతిథులు సుఖాసీనులవగలందుకు గోపాల్ తరఫున కోరుచున్నాను." అని సుధాకర్ నాటక ఫక్కీలో అన్నాడు.

"ఆఫ్టర్ ఎ లాంగ్‌టైమ్ ఉయ్ గాట్ దిస్ ఆపర్ట్యూనిటి. ఉయ్ షుడ్ ఎంజాయ్ ఫుల్లీ" అని అన్నాడు మురళి

"చీర్స్ ఫర్ ది హెల్త్ ఆఫ్ న్యూలీ మారీడ్ మిస్టర్ అండ్ మిసెస్ గోపాల్" అంటూ ప్రారంభించాం. మెల్లగా రెండో రౌండ్‌కూడా పూర్తిచేశాం. శరీరాలు కంట్రోలు తప్పడం ఆరంభించాయి.

సిగరెట్ ఆష్‌ట్రేలో నులిమి మాట్లాడడం మొదలుపెట్టాడు విజయ్, తడబడుతున్న గొంతుతో "ఐ విష్‌యు ఆల్ దిబెస్ట్ డియర్ గోపాల్ అండ్ మిసెస్ గోపాల్. హేపీనెస్, జోయ్, సన్స్‌అండ్ డాటర్స్. మనల్ని ఇలా ఫ్రీ...ఫ్రీగా ఎంజాయ్ చేసికోనిచ్చినందుకు మన భార్యలను కూడా అభినందించాలి."

"హే ! లెట్ అజ్ హేవ్ ది లాస్ట్ రౌండ్", అన్నాడు మురళి. "ఉయ్ హేవ్ టేకెన్ ఎనఫ్ ఫర్ ది సేక్ ఆఫ్ గోపాల్. అంచేత ఈ రౌండ్ మన యువకుడు, బ్రహ్మచారి అయిన అనిల్ గురించి సేవిద్దాం" అని సుధాకర్ అన్నాడు. అందరి ముఖారవిందాలు ఆనందంతో వెలిగినవి. మరల గ్లాస్‌లు కణకణలాడినవి.

టైమ్ పన్నెండు గంటలయింది."ఇక లేద్దామా" అని నేనన్నాను.అందరూ అంగీకార సూచకంగా తలూపారు. "థాంక్యూ ఫర్ గివింగ్ అజ్ ఎ నైస్ పార్టీ" అని మరొకసారి అభినందించి, అందరం బయటకు వచ్చాం.

అంతా మెల్లగా రోడ్డు మీద నడవడం మొదలుపెట్టాం కబుర్లు చెప్పుకుంటూ.

"నీ పెళ్ళెప్పుడోయ్" అంటూ అడిగింది విజయ్ భార్య మధ్యలో,

"ప్రస్తుతం ఆ ఆలోచనలు లేవు" అని అన్నాను.

"అదేం కాదు. నచ్చిన అమ్మాయి దొరకి వుండదు" అని విజయ్ అన్నాడు.

"హే! ఫ్రెండ్స్ దట్స్ ద రీజన్. లెట్స్ ఫైండ్ హిమ్ ఎ బ్రైడ్" అని మురళి అన్నాడు. "నీకో మంచి అమ్మాయిని చూపెడితే. మరి చేసుకొంటావా" అని విజయ్ భార్య అంది.

"తప్పకుండా. ఆ అమ్మాయి యెవరయింది నాకవసరం లేదు. కాని ఆ అమ్మాయి నాకు నచ్చాలి. ఆ అమ్మాయిని మీరు యిపుడే కనుగొనాలి. ఎందుకంటే. ఇపుడు నేను ఎనర్జి యెక్కువ స్టేట్ లో వున్నాను. రేపు మరల మామూలు స్థితికి వచ్చేయెచ్చు. అపుడు నాకు పెళ్ళి చేసుకోవాలి 'అని అనిపించకపోవచ్చు" అని అన్నాను.

"ఉన్నట్లుండి ఈ అర్ధరాత్రి వేళ నీకు పెళ్ళాన్ని ఎక్కడని వెదకమంటావు" అని సుధాకర్ అన్నాడు.

"అయితే నా పెళ్ళి విషయమై నన్నడగ వద్దు" అని అన్నాను.

"యురేకా! నాకో గుడ్ ఐడియా వచ్చింది. మనం ఆ అమ్మాయిని ఫోన్ లో వెదుకుదాం. హే! ఇక్కడ టెలిఫోన్ బాక్స్ కూడా వుంది" అని మురళి అన్నాడు.

"ఎ బ్యూటిఫుల్ థాట్. నా వద్ద అర్ధ రూపాయి బిళ్ళలేదే" అని అన్నాను.

వెంటనే నా వద్దకు నాలుగు అర్థ రూపాయి బిళ్ళలు వచ్చాయి వారినుంచి. "నంబర్ చెప్పండి" అని అన్నాను.

"ఏదో నంబర్ డయల్ చేయవోయ్" అన్నాడు విజయ్. నాలుగు, ఐదు.... అంటూ చెప్పబోతూ సడన్ గాఆపి "హే.. వద్దు. ఇది బాధ్యతతో కూడుకొన్న పని. ఆ తరువాత నీ అత్తగారికి, నీకు సరిపడక పోతే నీ జీవితాంతం నన్ను తిడతావు. వద్దునాయనా. ఎందుకొచ్చిన తంటా. ఈ బాధ్యతను అందరూ పంచుకోవాలి" అని అన్నాడు.

"పెద్ద ధైర్యస్థుడనని అంటావు. నీలో కూడా ఇంత పిరికితనం వుందన్నమాట" అని అన్నాను.

"పిరికితనం కాదు బుజ్జీ. ఇది బాధ్యత అని ముందే చెప్పాను. కావాలంటే నా పెళ్ళాన్ని అడుగు" అని విజయ్ బదులు చెప్పాడు.


"వన్ తింగ్ ఐ వాంటెడ్ టు ప్రొపోజ్" అని విజయ్ భార్య అంది.

"ఎవరూ ఇండివిడ్యుయల్ రెస్పోన్సిబిలిటీ తీసుకోకూడదనుకొంటే ఒక్కొక్కరు ఒక అంకె చెప్పండి. అది అనిల్ డయల్ చేస్తాడు."

"దివ్యంగా వుంది" అని విజయ్ అన్నాడు. ఇలా అప్పుడప్పుడూ అవకాశం వచ్చినప్పుడు భార్యను పొగడడం అతని అలవాటు.

రెండు అని విజయ్ అన్నాడు. నేను రెండు డయల్ చేశాను. తొమ్మిది అంది విజయ్ భార్య. మురళి 'సున్నా', అని నీ వంతు అన్నట్లు భార్యకేసి చూశాడు. మొదట "నా వంతేమీలేదు" అని, మరల ఏమనుకొందో ఏమో 'నాలుగు' అంది. సుధాకర్ 'అయిదు' అన్నాడు. అతని భార్య ఏమయినా కంట్రిబ్యూట్ చేస్తుందా అని చూశాను. ట్రెన్....ట్రెన్ మంటూ రింగింగ్ సౌండ్ వచ్చేసింది ఈలోపుగానే. విజయ్ నాకు హేండ్ కర్చీఫ్ యిచ్చి "మౌత్ పీస్ కవర్ చెయ్యి. వాళ్ళు నీ గొంతు గుర్తించలేరు. లేకపోతే నీ చేతి సంకెళ్ళ వరకు వస్తుంది" అని అన్నాడు.

ఎవరూ రిసీవర్ యెత్తలేదు యెంతసేపటికీ. నా కాబోయే భార్య నిద్రపోతుందనుకొంటాను. మరల రోడ్డుమీద నడక సాగించాం. స్ట్రీట్ టర్నింగ్ వచ్చే సరికి. "ఉయ్ విల్ పుష్ ఆఫ్. గుడ్ నైట్" అంటూ అందరూ వెళ్ళిపోయారు. మళ్ళీ కొంతదూరం వెనుకకు నడచివచ్చి పేవ్ మెంట్ మీద చతికిలబడ్డాను.



* * *

నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ అప్పుడప్పుడు కార్ల చప్పుడు. ఒంటరితనం తోడు కావాలనిపిస్తోంది. జరిగిన సంఘటనలు ఒకదాని తరువాత మరొకటి గుర్తుకొస్తున్నాయి. మరల ఆ నంబర్ గుర్తుకొచ్చింది. దగ్గరలో వున్న టెలిఫోన్ బాక్స్ లోకి ప్రవేశించాను. పాకెట్ లో చేయిపెట్టి అర్ధ రూపాయి బిళ్ళ కొరకు వెదికితే విజయ్ యిచ్చిన హేండ్ కర్చీఫ్ దొరికింది. మౌత్ పీస్ దానితో కవర్ చేసి రెండు, తొమ్మిది, సున్న, నాలుగు, ఐదు డయల్ చేశాను. ఎక్కువ సమయం నిరీక్షించవలసిన అవసరం లేకపోయింది.

"హల్లో."

ఎ లేడి టోన్. సర్ ప్రైజింగ్. నేను నిద్దుర పోవడంలేదు. కొద్దిగా అలసట చెందానంతే. నేను ఇంకా కాన్షస్ లోనే వున్నాను.

"గుడ్ మార్నింగ్" అని అన్నాను.

"గుడ్ మార్నింగ్. ఎవరు మాట్లాడుతున్నది."

"నేనండి. ముందు ఒకరి నొకరు పరిచయం చేసుకొందాం" అన్నాను. మొదట ఆమె తిడుతుంది. లేకపోతే రాంగ్ నంబర్ అని ఫోన్ పెట్టేస్తుంది అనుకొన్నాను. కాని ఈ రెంటిలో ఏదీ జరుగలేదు. అంచేత ఆశ్చర్యపడ్డాను.

"ఇలా ఫోన్ చేయడానికి ఇది సమయం కాదని తెలియదా?"

"ఛ....ఛ.... అదేమీకాదండి. ఇప్పుడే

స్నేహితుని పార్టీనుంచి వచ్చాను. ఐఫీల్ లోన్లీ. అందుచేత యెవరికయినా ఫోన్‌చేసి మాట్లాడుదాం అనిపించింది. ఇతరులను ఏడిపించాలని మాత్రం కాదు."

"అలా యెందుకనిపించింది? మీకు పెళ్ళి కాలేదా?"

"లేదు. మరి మీకో?"

నా ప్రశ్నకు బదులుగా ఆమె నవ్వు మాత్రం వినిపించింది.

"అయినా నా ఫోన్ నంబర్ మీకెట్లా చిక్కింది?"

"కేవలం యాదృచ్ఛికం. నాకు తట్టిన అంకెలు నేను డయల్ చేశాను."

"అద్భుతంగా వుంది."

"నేను మిమ్మల్ని కలుసుకోవాలనుకొంటున్నాను."

"వీలు లేదు. దీనికి ఇష్టపడితేనే మీరు నాతో మాట్లాడవచ్చు. ఇప్పటికే ఆలస్యమయింది. నిద్రపొండి. రేపు నిద్రలేవగానే అంతా మరచిపోతారు. మీరే చూస్తారుగా."

"మిమ్మల్ని చూడాలనుకొంటున్నా. కనీసం రోజూ మాట్లాడుదాం అనుకొంటున్నాను."

"నా టెలిఫోన్ నంబర్ మీకు తెలుసుగా. లేకపోతే అపుడే మరచిపోయారా? మీకు బాగా వున్నపుడు మీకు ఫోన్ చేయాలనిపిస్తే మీరు ఫోన్ చేయవచ్చు."

"నిజంగానా?"

"నిజంగానే గుడ్‌నైట్" అని అంది.

"రేపు ఉదయం ఫోన్ చేస్తాను" అని ఫోన్ పెట్టేశాను.

ఇదంతా నేను వేళాకోళం చేసినట్లు అనిపించినా, ఎందుకో నా హృదయం తేలిక అయినట్లు అనుభూతి పొందాను. ఇంటివైపు నడవడానికి ఉపక్రమించాను. ఈసారి అదే వెడల్పాటి ఢిల్లీ రోడ్డుమీద ఒక్కడినే నడుస్తున్నా, నాకు ఒంటరితనం అనిపించలేదు.

* * *

ఆ మరునాడు ఉదయం నేను ఫోన్ చేయలేదు. నేను చాలబిజీగా ఉండడంవలన ఆ విషయమై ఆలోచించడానికే సమయం లేకుండా పోయింది. అలా నాలుగైదు రోజులు గడిచిపోయినవి. ఓరోజు మా డివిజన్ హెడ్‌తో గొడవ వచ్చింది నాకు. ఆయనది షార్ట్ టెంపర్. నేను ఎంత కంట్రోల్ చేసుకున్నా, ఆయన మాట్లాడే తీరు నాకు బాధ కలిగించింది. దానితో నేను కూడా కొంచెం ఎక్కువే మాట్లాడవలసి వచ్చింది. చివరకు నీవెంత, నీవెంత అనుకోవడంవరకు వచ్చింది. సాయంకాలం వరకు ముభావంగా గడిపాను. రోజూ





గ్యాస్ కొరతవల్ల ఇప్పుడు
ఇబ్బంది పడనక్కరలేదు

JOHNSON

కాయిల్ స్టవ్ వాడండి
అది నిరపాయకరం

స్నో విజన్, ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

Suvarna

ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి ఫోన్ : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15, 'EVEREST' 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.




ఒకే ఒక
స్టాపేక్
తలనొప్పిని
త్వరగా శమనము చేయును
• జలుబు మరియు ఫ్లూ
• ఒంటి నొప్పి
• పంటి నొప్పి
మొదలగు వాటికీ
ఉపయుక్తం




P-8001 A

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ వవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700. 1010

సినీ తారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదం ఫోటోల సెట్టు 5రూ. పయస్టార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫోటోల సెట్టు 6రూ. తెలుగు, హిందీ తారల అడ్రసులు (ఫోనునంబర్లతోసహా) గల పుస్తకం 2రూ. ఎం.ఓ. చేయండి!
SUVARNA
వై. కె. మూర్తి
దాసరివారివీధి, విజయవాడ-2



సమర్థవంతమైన ర్యాలిఫ్యాన్ సర్వీసు సిబ్బంది దీనివెనకవుంది. మీకు ఎప్పుడైనా అవసరం అయితే!
ర్యాలిఫాన్
nirmala
ఆడియోవిజన్
విజయవాడ-2

మాదిరిగానే విజయ్‌తో కలిసి ఇంటికి బయలుదేరాను. ఇన్‌స్టిట్యూట్ నుంచి— చెప్పడం మరచిపోయాను మేం యిద్దరం ఒకే రిసెర్చి యిన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నాం. తనకి నా విషయం తెలిసిందనుకొంటా హితోపదేశం మొదలు పెట్టాడు.

"నీ ఆర్గ్యుమెంట్ సరియైనదే. అయినా యెదుటవాని తప్పు యెత్తి చూపుతున్నట్లు మాట్లాడకూడదు. ఇట్లా మాట్లాడితే ప్రతి వారితోను గొడవ పెట్టుకోవలసి వస్తుంది. అందరితో గొడవ పెట్టుకొని జీవించడం కష్టం. ఇటువంటి వారినుంచి తప్పించుకోడానికి వేరే పద్ధతి వుంది. అంత కఠినంగా చెప్పకుండా అర్థమయ్యే. అర్థమవనట్లుగా చెప్పాలి. ఉదాహరణకు నా భార్యనే తీసుకో. అప్పుడప్పుడు తను అడుగుతుంటుంది తను వండిన కూర ఎట్లా వుందని. బ్రహ్మాండంగా వుంది. కాని, కొంచెం ఉప్పు తక్కువయింది. కారం ఎక్కువయింది అని ఉన్న ఫాల్ట్‌ని మైల్డ్‌గా చెప్తాను. అదే ఏడ్చినట్లుందనో, ఘోరంగా వుందనో అన్నాననుకో- యిక వేరే చెప్పాలా. ఎదుటివారు రియలైజ్ అయ్యేంతవరకు ఓపిక వట్టాలి."

"నీవో ఇడియట్‌వి. మా బాస్ గురించి నీకేం తెలుసు ? నీ కాంప్రమైజేషన్‌తో నేను విసిగిపోయాను" అని కొంచెం కసిరాను.

"సరేలే. నువ్వు అంతకంటే పెద్ద మూర్ఖుడివి. పట్టుదల ఎక్కువ. నీతో మాట్లాడడం కష్టం. ఆ విషయం వదిలేయ్ ఇంటికిపోయి కాఫీ త్రాగుదాం" అని తనింటికి ఆహ్వానించాడు.

*  *  *

గుమ్మంలోనే ఎదురయింది విజయ్ భార్య పిల్లవాణ్ణి ఎత్తుకొని.

"మీకు తెలుసా మా అబ్బాయి పప్పా. మమ్మా అంటున్నాడు." అంటూ సంతోషంగా తన పిల్లవాణ్ణి గురించి చెప్పింది.

"అనిల్ అంకుల్ వచ్చాడురా చూడరా" అని అన్నాడు విజయ్.

"పప్పా, మమ్మా, పప్పా మమ్మా ...." నావైపు చూస్తూ అనడం మొదలుపెట్టాడు. నాకు, విజయ్‌కి నవ్వాగింది కాదు. పిల్లాణ్ని నాకిచ్చి కాఫీ చేయడానికి లోనికి వెళ్ళింది.

"యు వెయిట్ హియర్ నేను డ్రెస్ చేంజ్ చేసుకొస్తాను" అని విజయ్‌కూడా లోనికి వెళ్ళాడు.

పిల్లవాడు ఎంతో ముద్దొస్తున్నాడు. నాకు కూడా అటువంటి బాబు ఉంటే ఎంత బావుణ్ను అనిపించింది. తొందరగా పెళ్ళి చేసుకోవాలి. అంత తొందరగా నచ్చిన అమ్మాయి ఎట్లా లభిస్తుంది ....ఈ విధంగా నా ఆలోచనలు సాగిపోతున్నాయి. సడన్‌గా ఆ రాత్రి జరిగిన విషయం గుర్తుకొచ్చింది. ఆ స్వీట్ వాయిస్.... ఆ టెలిఫోన్ నంబర్ యేమిటబ్బా ! చివరి రెండు అంకెలు నాలుగు ఐదు. ఆ ! మొదటిది రెండు. మధ్యలోది సున్న. రెండో అంకె ఏమిటో ?....

'ఏమిటా దీర్ఘాలోచన కాఫీరెడీ' అంటూ నా ఆలోచనలకు అంతరాయం కలిగించింది విజయ్ భార్య. ఆ రాత్రి జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తున్నాను అన్నాను. "మేము వెళ్ళిపోయిన తరువాత మళ్ళా ఫోన్ చేశావా ఏమిటి ?" అని అడిగింది. మొత్తం జరిగిన సంగతి చెప్పాను. దానితోపాటు టెలిఫోన్ నంబర్ మరచిపోయిన సంగతికూడా చెప్పేశాను.

"టెలిఫోన్ నంబర్ ఏమిటో నాకు గుర్తులేదు. కాని నేను చెప్పిన అంకె మటుకు నాకు గుర్తుంది. అది తొమ్మిది" అని అంది.

*  *  *

"హెలో, గుడ్‌మార్నింగ్. నేనండి మాట్లాడుతున్నా."

"గుడ్‌మార్నింగ్, నేనంటే ?"

"అపుడే నన్ను మరచిపోయారా ? గుర్తు తెచ్చుకోండి."

"మీ గొంతు కొత్తగా వుంది."

తక్షణమే నేను చేసిన తప్పేమిటో గుర్తుకొచ్చింది. వెంటనే హాండ్ కర్చీఫ్‌తో మౌత్‌పీస్ కవర్ చేసి.

"నేనేనండి. క్రిందటిసారి త్రాగడం వలన నా గొంతు మారిపోయి వుండవచ్చు."

"లేదు లేదు. ఇప్పుడు మీ గొంతు ఎట్లా వున్నదో క్రిందటిసారికూడా అట్లానే వున్నది. ఎందుకో మొదట కొత్త గొంతువలె విన్పించింది. సో ఇవాళ మీరు బాగా వున్నారన్నమాట."

"ఎంతో ప్రశాంతంగా. హైకోర్టులోని జడ్జిలాగ. మీకు ఫోన్ చేయాలని చాలా ఆత్రంగా వుంది. మీ ఫోన్ నంబర్ కూడా నోట్ చేసుకొన్నాను ఒకవేళ మరచిపోవచ్చేమోనని" అనుకోకుండా మొదటిసారి అబద్ధమాడాను.

"మీరు ఫోన్ చేసినందుకు చాలా ఆనందంగా వుంది. యివాళ నేను కూడా ఒంటరితనం ఫీలవుతున్నా. నా రేడియో పనిచేయడం మానేయడంచేత."

"మీరు రోజూ ఇంత ఆలస్యంగా నిద్రపోతారా?"

"అవునండి. నేను రోజూ రేడియో వింటూ చాల రాత్రివరకు మేల్కొనే వుంటాను. ఈరోజు రేడియో వాల్వ్ కాలిపోయింది. రేడియో పని చేయడం మానేసింది. ఏమీ తోచడం లేదు."

ఫోన్‌లో యెవరో దూరంనుంచి పియానో వాయిస్తున్న శబ్దం వినబడింది. నా క్యూరియాసిటి చంపుకోలేకపోయాను.

"ఈ రాత్రివేళ పియానో వాయిస్తున్న దెవరండి ?"

"ఓ అదా" అంటూ ఆమె నవ్వింది. "అది నా ఫ్లాట్‌లోకాదు. ప్రక్కయింటి నుంచి. ఆ అమ్మాయి అర్ధరాత్రివరకూ ప్రాక్టీస్ చేస్తూ వుంటుంది. గోడలు అంత మందమయినవి కావు. అంచేత అప్పుడప్పుడు నాకు పిచ్చెక్కుతుంది. నా రేడియో పనిచేస్తున్నపుడు ఈ గోల వినిపించదు. ఈ రేడియో అనేది ఓ అద్భుతమైన వస్తువు. ఇది వుంటే నా రూమ్‌లో అన్నీ వున్నట్లే అనిపిస్తుంది. నల్లటి చీకటితో నిండిన ఈ రాత్రి ప్రపంచం. శ్రావ్యమైన ధ్వనితో నిండిన ఆ నీలాకాశము. ఏరోప్లేన్స్ ఇంకా మరెన్నో."

"ఏరోప్లేన్స్ కూడానా." అని అడిగా నవ్వుతూ.

"హా. హా... ఆ శబ్దము మీరూ వింటున్నారా ?"

ఆమె నిశ్శబ్దంగా ఏదో వింటోందని గ్రహించాను. కొద్ది వ్యవధిలో నాకు విమాన శబ్దం వినిపించింది.

"రేడియో, విమానం రెండూ చాల దగ్గర సంబంధం కలిగివున్నాయి. ఏమంటారు ?" అని అంది.

"అవి రెండూ ఒకే ఆకాశాన్ని పంచుకోవడంవలన కావచ్చు." అన్నాను.

"కాబోలు" అని నిశ్శబ్దంగా వుండిపోయింది. విమాన శబ్దం వినిపించడం ఆగిపోయింది కాని. పియానో శబ్దం ఘోరంగా వినిపిస్తోంది.

"అంతా నేనే మాట్లాడుతున్నాను. మీరేమీ మాట్లాడడంలేదు అడిగిన ప్రశ్నలకు జవాబులు తప్పించి. మీరు కూడా ఏదైనా మాట్లాడండి?"

అలా సడన్‌గా అడిగేసరికి ఏమి మాట్లాడాలో తెలియక నా ప్రస్తుత ఉద్యోగం మీద ఆసక్తి లేకపోవడం, నా బాస్‌కి, నాకు జరిగిన గొడవ అంతా చెప్పేశాను. అంతా చెప్పిన తరువాత నేను చేసింది పొరపాటు అనిపించి వెంటనే ఫోన్ పెట్టేశాను. ఆంతరంగిక





"బాలజ్యోతి" చదవి ఆనందించండి!






కర్నూలు నవచైతన్య సాహితీ సదస్సులో డాక్టర్ సి. నారాయణరెడ్డి తనకు జరిగిన సన్మానానికి సమాధానమిస్తున్నప్పుడు తీసిన చిత్రం. రాయలసీమ పేపరుమిల్లు మేనేజరు శ్రీ టి. జి. వెంకటేష్, ఇంజనీరు శ్రీ కె. వి. చలమారెడ్డి, శ్రీ బి. శివరామశర్మ లను చూడవచ్చు.

---

విషయాలు ఇతరులతో పంచుకోవాలనుకోవడం ప్రకేజీకాక మరేమిట ?

* * *

ఈమధ్యన నేను టెలిఫోన్‌ల గురించి చాల ఎక్కువగానే ఆలోచించానేమో అనిపిస్తుంది. ప్రతి దానికి ఏదో ఒక ప్రత్యేకత. మా లాబ్ చీఫ్‌దగ్గర ఓ టెలిఫోన్ వుంది. అది మ్రోగినపుడల్లా అతను వణికిపోతుంటాడు ఏ క్షణంలో అయినా అది చెడ్డ వార్తలను మోసుకరావచ్చుని. అతని ఇల్లు దోచుకోబడిందని, లేకపోతే అతని పెళ్ళాం లేచిపోయింది లాంటి వార్తలు.

మా జనరల్ ఆఫీస్‌లో డయల్ లేకుండా ఓ టెలిఫోన్‌వుంది. అది ఇంపొటెంట్. చక్రంలేని కారులాగ, అడ్రస్‌లేని ఉత్తరంలాగ. నిస్సహాయతకు, పరాధీనతకు అది ఒక చిహ్నం. ఎవరయినా మీకు ఫోన్ చేయవచ్చు. కాని మీరు యెవరికి ఫోన్ చేయలేరు. దీనికి సరిగ్గా వ్యతిరేకమైనది యెదురుగావుండే పబ్లిక్ టెలిఫోన్. అది బాధ్యతా రాహిత్యానికి చిహ్నం. మీరు యెవరికైనా ఫోన్‌చేసి ఏదైనా మాట్లాడవచ్చు. కాని తిరిగి అతను రిప్లయి యివ్వలేడు. అందుచేత నా యింటిలో టెలిఫోన్ లేదని నే నెప్పుడూ ఏడవలేదు. కాని ఈ మధ్య అర్ధరూపాయి బిళ్ళల గురించి డి. టి. సి. (ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్) బస్సులలో, పాన్ షాపులలోను కలెక్ట్ చేసుకోవాలంటే బాధగా వుంది.

రోజూ ఆమెకు ఫోన్ చేయడం దైనందిన కార్యక్రమంలో ఒక భాగంగా మారిపోయింది. మా మాటలు అవధులు లేకుండా సాగిపోతున్నాయి. మధ్యమధ్యలో ఆ పియానో వాయిద్యం, విమాన ధ్వని, బాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లాగ ఆ రేడియో సంగీతం అన్నీ నా జీవితంలో ఒక భాగమైపోయినవి. అలవాటు, అవసరంగా కూడా అయ్యాయి.

నేను ఆమె గురించి తెలుసుకొన్నది చాల తక్కువ. ఆమెపేరు రూప, బెంగాలి. అంచేత మా మధ్య మాటలు ఆంగ్లములోనే సాగుతుండేవి. ఆమె రాత్రుళ్ళు రేడియో వింటుంది. ప్రక్క యింటిలో అమ్మాయి పియానో అర్ధ రాత్రి వరకు వాయిస్తుంది. ఆమె ఒంటరిగా వుంటున్నదని, ఆమెకు నల్లటి కళ్ళున్నాయని, ఆమె షూసైజు ఏడని. అవి నాకు తెలిసినంత వరకు. అందుచేత ఆమె గురించి యింకా తెలుసుకొంటూనే వున్నాను.

"మీ వయసెంత?" అని అడిగా ఓసారి.

"ఓ. నా వయసా. ఐయామ్ ఏన్ ఓల్డ్. ఓల్డ్ లేడి, విత్ లాట్స్ అండ్ లాట్స్ ఆఫ్ గ్రాండ్ చిల్డ్రన్" అని అంది.

ఆమె యూత్‌ఫుల్ వాయిస్‌నుబట్టి నాకు అలా అనిపించలేదు. నన్ను ఏడిపించడానికట్లా అంటున్నదని గ్రహించాను. ఆమెకు తనగురించి, తనపని, తన ఫామిలీ పొజిషన్ గురించి చెప్పడం ఇష్టంలేదు. అలాగే నా గురించికూడా ఏమి అడగలేదు. కాని నా వయస్సు ఇరువదిఎనిమిది, ఒంటరిగా వుంటున్నానని, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నానని ఆమెకు తెలుసు. ఒక్కనా నిజమైన పేరుమాత్రం ఆమెకు తెలియదు. నేను సునీల్ అని ఆమెకు పరిచయం చేసుకొన్నాను. నిజానికి రూపకూడా ఆమె అసలైన పేరు కాదేమో ?

* * *

"మనం ఎప్పుడు కలుసుకోవచ్చు?" అని అడిగా ఓసారి, మా మధ్య పెరిగిన పరిచయాన్ని పురస్కరించుకొని.

"ఎందుకు కలుసుకోవాలి ? మనం ఇలా వుండడమే ఎంతో బావుంటుంది. నీకు ఎలా అన్పిస్తుందో ఏమో, నాకు మాత్రం ఈ టెలిఫోన్ కాల్స్ చెప్పలేని అనుభూతిని కలిగిస్తున్నాయి. ఒక గంటలో ఒకరి నుంచి టెలిఫోన్‌కాల్ వస్తుందని, అతనెవరో తెలియకపోయినాసరే నా ఆలోచనలను అతనితో పంచుకోగలనని, అన్న ఆలోచన నాకు ఎంతో ఆనందాన్నిస్తున్నది. మీకు కూడా అట్లా అనిపించడం లేదూ ? మనం కలుసుకొన్నామనుకో ఒకరి గురించి ఒకరికి తెలిసిపోతుంది. మన పరిచయం సామాన్యంగా మారిపోతుంది. అది నా కిష్టంలేదు. అంచేత మన పరిచయం యిలా వుంచితేనే బావుంటుంది. చూడండి మీకే చాల యింటరెస్టింగ్ అనిపిస్తుంది. అది సరే. మీ ఆఫీస్ విషయం యెట్లా వుందండి ? మీ బాస్ యేమంటున్నాడు ?"

"ఏమీ మార్పులేదు. రోజు రోజుకి పరిస్థితి మరీ అధ్వాన్నమవుతున్నది. మా బాస్‌తో నాకు సరిపడడంలేదు. అంచేత ఈ ఉద్యోగం వదిలివేయా లనుకొంటున్నాను."

"వదిలేసి ఏమి చేయాలనుకొంటున్నారు?"

"ప్రస్తుతానికి ఏమీ తెలియడంలేదు. మీరేమయినా సలహా ఇస్తారా ?" అని అడిగా.

ఆమె వద్దనుంచి జవాబు లేదు. విమాన శబ్దం మాత్రం వినిపించింది.

(ఇంకా వుంది)